సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం | 29 | ఏప్రిల్ | 2023



అటవీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎఫ్‌వో సూర్యనారాయణ సూచించారు. II లో



సకాలంలో అర్జీలన్నీ పరిష్కారం

స్పందనలో గిరిజనుల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. II లో



కొనసాగుతున్న వర్షాలు

మండలంలోని కిల్లోగుడ,అరకు సంతబయలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. II లో

న్యూస్‌రీల్

నేడు చింతూరులో స్ట్రక్చర్ సర్వే

చింతూరు: పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్య క్రమంలో గుర్తించిన చింతూరులో శనివారం నుంచి గృహాల (స్ట్రక్చర్) సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ కారం సుబ్బారావు తెలిపారు. సర్వేలో భాగంగా నివాస గృహాలు, ఇతర కట్టడాలు, చెట్లు తదితర వివరాల గురించి సర్వే బృందాలు ఇంటింటికీ తిరిగి సర్వే చేపడతాయని ఆయన తెలిపారు. సర్వే బృందంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్, విలేజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఫారెస్టు, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సర్వే నిర్వహించే సమయంలో గృహాల యజమానులు అందుబాటులో ఉండి ఇళ్లకు సంబంధించిన రికార్డులు చూపించి సర్వేలో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో ఆమోదించిన కట్టడాలకు మాత్రమే ప్రస్తుత సర్వే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలల ప్రవేశ పరీక్ష రేపు

రాజవొమ్మంగి: ఏకలవ్య పాఠశాలల్లో (ఈఎంఆర్‌ఎస్) 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం జరుగనున్న ప్రవేశపరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గురుకులాల సంస్థ కన్వీనర్ ఎస్‌జీ. కిషోర్‌బాబు తెలిపారు. రంపచోడవరంలో రెండు, రాజవొమ్మంగిలో ఒకటి, చింతూరులో రెండు కేంద్రాల్లో మొత్తం 2,501 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు కూడా పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉన్నందున విద్యార్థుల సంఖ్య కొంతమేర పెరిగే అవకాశం ఉందన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. హాల్ టిక్కెట్లలో ఆర్‌సీవరం అని పక్కనే రాజవొమ్మంగిగా పొరపాటున ప్రింట్ అయ్యిందన్నారు. ఆర్‌సీవరం అని ఉన్న వారు రంపచోడవరంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. వీరికి రంపచోడవరంలోని డిగ్రీ కళాశాల వద్ద గల బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రాచీన విత్తనాలే ప్రాణాధారం

ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా దేశీయ విత్తనాల వినియోగంతోపాటు పాత సాగు విధానాలు అనుసరించే దిశగా పలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. దీనిపై ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనులకు అవగాహన కల్పించేందుకు జాతర పేరిట ఏటా పాత విత్తనాల పండుగలు నిర్వహిస్తూ సంప్రదాయ విత్తనాల పరిరక్షణకు పాటుపడుతున్నాయి.

- అవగాహన కల్పించిన తూర్పు కనుమల జీవ వైవిధ్య జాతర
- పలు రాష్ట్రాల ప్రతినిధులతో దేశీయ విత్తన స్టాళ్లు
- సంప్రదాయ విత్తన పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు



ఒడిశా వాసులు ప్రదర్శనలో ఏర్పాటుచేసిన ప్రాచీన విత్తనాలు

డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ కిల్లోగుడ గ్రామంలో గిరి రైతులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో సందడి నెలకొంది. పాత రకాల విత్తనాలను ప్రదర్శిస్తూ సంజీవిని స్వచ్ఛంద సంస్థ, ధింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం నిర్వహించిన తూర్పు కనుమల జీవ వైవిధ్య జాతర పేరిట నిర్వహించిన విత్తన పండగకు మంచి స్పందన లభించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. అన్ని పంటలకు సంబంధించి విత్తనాలతో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమం గిరి రైతులు అవగాహన పొందేందుకు దోహదపడింది.

అవగాహన కల్పించిన నిపుణులు

అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారిత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్, జీవవైవిధ్యమండలి రీజినల్ కోఆర్డినేటర్ జానకిరామ్ తదితరులు రైతులకు పాత విత్తనాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

సేంద్రియ ఉత్పత్తులతో వంటకాలు..

సేంద్రియ ఎరువులతో పండించిన చోడి, వరి, సాములు, కొర్రలు, కాకిజొన్న తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. ఒడిశాలోని సడమ్ గ్రామానికి చెందిన బృందం ప్రదర్శించిన ధింసా నృత్యం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొయ్య డ్యాన్సు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పాత విత్తనాలివే..

ఒడిశా, ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వివిధ స్వచ్ఛందసంస్థలు ఆయా ప్రాంతాల్లో గిరిజనులు పండించిన పాత విత్తనాలను ప్రదర్శించాయి. వీటిలో రాజ్‌మా (ఎరుపు, తెలుపు), ఒలువాలు కందులు, రాగి, కాకి జొన్న, బొబ్బర్లు, డిల్లి పిక్కలు, నలుపు, తెలుసు బస్తర్లు, జొట్ట, గంధం పిక్కలు, పెద్ద బస్తర్లు, సోయాబీన్, కంది, సిరికందులు, కొద్ది కందులు, కలకంది, కలబంద, కుంకుడు, వనమూలికలు తదితర 227 రకాలను ప్రదర్శనలో ఉంచారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

విత్తనాల పండగకు అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గిరి రైతులు విచ్చేశారు. అతిథులకు సేంద్రియ ఎరువులతో పండించిన ఉత్పత్తులను ప్యాకెట్ల రూపంలో అందజేశారు. సంజీవని సంస్థ బ్యాగ్‌లతో పాటు 230 మంది రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసింది. రానున్న కాలంలో కూడా ఈ విత్తనాల పండగను నిర్వహిస్తామని సంజీవిని సంస్థ డైరెక్టర్ దేముళ్లు తెలిపారు.

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతానికి చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత కార్యవర్గం సక్రమంగా విధులు నిర్వహించక పోవడాన్ని గుర్తించినందున కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో గిరిజన ప్రజలకు అవసరమైన సేవలు అందించటం, రక్త నిల్వలు పెంపొందించడంలో ఆసక్తి, పట్టుదల, నిజాయితీతో ఉత్సాహంగా ముందుకు వచ్చే సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. నూతన రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించి ప్రస్తుత రెడ్ క్రాస్ జీవిత సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా మిత్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కొత్త కార్యవర్గం ద్వారా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేయడంతో పాటు రెడ్ క్రాస్ సంస్థ కార్యాకలాపాలను విస్తృతం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

భూముల ధరల స్థిరీకరణపై సమీక్ష

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన భూముల ధరల స్థిరీకరణపై ఐటీడీఏ పీవో,ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ శుక్రవారం సాయంత్రం తహసీల్దార్లతో సమీక్షించారు. పాడేరు డివిజన్ పరిధిలోని గిరిజన భూములకు రిజిస్ట్రేషన్ శాఖతో పాటు, రెవెన్యూ అధికారులు సమగ్రమైన సర్వే చేపట్టాలని సూచించారు. భూముల ధరలను తెలుసుకున్న ఆయన పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి బాలకృష్ణ. జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సీఎం జగన్ విశాఖ పర్యటన ఖరారు

- 3న భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన
- మధురవాడలోని వైజాగ్ ఐటీ టెక్ పార్కుకు శ్రీకారం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఖరారైంది. మే 3న ఉదయం 8 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రాయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామంలో గల హెలిప్యాడ్ వద్దకు 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 10.25 గంటలకు జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సభ ముగిసిన తర్వాత 12.30కి బయలుదేరి ఎ.రావివలస గ్రామం వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ స్థానిక రాజకీయ నాయకులతో సుమారు 40 నిమిషాలపాటు సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్ నంబర్ 3 వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి ఐటీ హిల్స్ నంబర్ 4లో గల వేదిక వద్దకు 2 గంటలకు చేరుకుంటారు. అక్కడ 30 నిమిషాలపాటు ఉంటారు. అనంతరం 2.30 గంటలకు ''వైజాగ్ ఐటీ టెక్ పార్కు'' శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 10 నిమిషాలపాటు ఫొటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి రుషికొండలో గల బాలాజీ బే మౌంట్ విల్లా ఎదురుగా ఉన్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రెసిడెన్సీకి చేరుకుంటారు. ఎంపీ కుమారుడు నూతన వధువరులను ఆశీర్వదిస్తారు. అక్కడి నుంచి 4.35 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ 20 నిమిషాలపాటు స్థానిక రాజకీయ నేతలతో ఇంటారాక్ట్ అవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి 6.20కి చేరకుని రోడ్డు మార్గాన తాడేపల్లిలో గల తన నివాసానికి చేరుకుంటారు. ఈ మేరకు సీఎం పర్యటన వివరాలను కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం వెల్లడించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో ఏజెన్సీలోని రోగులకు, అత్యవసర సేవలకు ఆస్పత్రి చాలా ముఖ్యమైందన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. మందుల వివరాలను పక్కాగా రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆస్పత్రిలో నిరుపయోగమైన, పాత సామాన్లకు వేలంపాట నిర్వహించాలన్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కల్పన. వైద్యాధికారులున్నారు.



ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

క్లుప్తంగా

ఐఐటీ, నీట్‌లపై శశిలో అవగాహన సదస్సు రేపు

తగరపువలస: సంగివలస శశి విద్యాసంస్థల ఆవరణలో ఈ నెల 30న నీట్, ఐఐటీలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ బూరుగపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ సదస్సులో అనుభజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులు, తల్లిదండ్రులకు నీట్, ఐఐటీలపై సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు వినియోగించుకోవాలని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేక్రా క్రాంతి సుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా కోర్టు పీపీ జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు

విశాఖ లీగల్: విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ కేసులు వాదించే పీపీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇన్‌చార్జ్, లా సెక్రటరీ అయిన సత్య ప్రభాకర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న ఎన్.కాళిదాసురెడ్డి పదవీ కాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బీసీ సంక్షేమ సంఘం బహిరంగ సభ నేడు

అనకాపల్లి టౌన్: రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 'హాలో బీసీ..చలో అనకాపల్లి' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతారన్నారు.

సకాలంలో అర్జీలన్నీ పరిష్కారం

- స్వీకరించిన వెంటనే ఆన్‌లైన్
- స్పందనకు అధికారులు హాజరు తప్పనిసరి
- అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక

సాక్షి, పాడేరు: ఐటీడీఏలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి గిరిజనుల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ చేసి వాటిని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన గిరిజనుల నుంచి వ్యక్తిగత, గ్రామాల సమస్యలపై 75వినతులను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలపై అన్నిశాఖల అధికారులు జవాబుదారులుగా ఉండాలన్నారు.అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని ఆయన ఆదేశించారు.

ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు

స్పందన కార్యక్రమానికి ప్రతి శుక్రవారం ఉదయం 10గంటలకు ఐటీడీఏకు చేరుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్పందనకు హాజరుకాని పలుశాఖలకు చెందిన ఎనిమిది మంది అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అత్యవసర పనులుంటే జిల్లా స్థాయి అధికారులు తన అనుమతి, ఐటీడీఏ పరిధిలోని అధికారులు పాడేరు ఐటీడీఏ పీవో నుంచి అనుమతి పొందడం తప్పనిసరి అన్నారు. ముందస్తు అనుమతి లేకుండా అధికారులు స్పందనకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఇంజనీరింగ్ విభాగాల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, కొండయ్య పడాల్, లీలాకష్ణ, బాలసుందరబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్.నందు, ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, జీసీసీ పాడేరు, చింతపల్లి డీఎంలు పార్వతమ్మ, సింహాచలం, డీఎల్పీవో కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని కొయ్యూరు మండలంలోని కొప్పుకొండ కొత్తవీధి వాసులు విన్నవించుకున్నారు.
- అంగన్వాడీ కేంద్రం మంజూరు చేసి, కార్యకర్తను వెంటనే నియమించాలని డుంబ్రిగుడ మండలం కంద్రూం పంచాయతీ,కాంఖగూడ గ్రామానికి చెందిన పోరన్న, భాస్కరరావు కోరారు. ఇదే పంచాయతీలోని సర్రాయి,జాకరవలస తాగునీటి పథకానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, దండగూడ, బైలుగూడ గ్రామాలకు సోలార్ తాగునీటి పథకాలు మంజూరు చేయాలని సర్పంచ్ కిముడు హరి కోరారు.
- డుంబ్రిగుడ మండలం చంపపట్టి గ్రామానికి వెళ్లే రోడ్డులోని వాగుపై వంతెన హుద్‌హుద్ తుఫాన్‌లో కొట్టుకుపోయిందని, వంతెన నిర్మాణం చేపట్టి గెడ్డ అవతలి గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు దొబ్బన్న,రాజులు కోరారు.
- పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ మొండికోట,చెక్కరాయి,బొడ్డాపుట్టు గ్రామాలకు తారురోడ్డు నిర్మించాలని ఎం.మత్స్యలింగం వినతి పత్రం అందజేశారు.
- హుకుంపేట మండల కేంద్రంలోని సర్వే నంబర్ 49/4లో శ్మశాన వాటికను కొందరు అక్రమించి గుడారాలు ఏర్పాటు చేస్తున్నారని, గిరిజనులు వై.ప్రభాకరరావు, సీ.హెచ్.మన్మథ ఫిర్యాదు చేశారు.

స్పందన వినతులు 24 గంటల్లో పరిష్కారం

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించిన సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సమస్యలను పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందన పోర్టల్‌లో నమోదు చేసిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిశీలించి అర్జీదారునితో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించి, ఆర్థిక పరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఫిర్యాదులపై సక్రమంగా ఎండార్స్‌మెంటు వేసి, అధికార సంతకం పెట్టి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీదారునికి సరైన సమాధానాన్ని పంపించాలన్నారు. అర్జీదారునితో మాట్లాడి ఫొటో తీసుకుని స్పందన పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

డ్రైడే-ఫ్రైడేపై విస్తృత అవగాహన


నివాసాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, పాడేరు: కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా ఆదేశాల మేరకు మండలంలోని చింతలవీధి ఉప ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగారు. నడిమివీధి గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటా తిరిగిన వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి, నిల్వ నీటిని తొలగించారు. టైర్లు, పాతట్యాంకులు, గోళాలు, ఇతర నీరు నిల్వ ఉండే సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఏఎన్ఎంలు కృష్ణవేణి ప్రజలకు డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎపిడిమిక్ సీజన్‌లో వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం అందించాలన్నారు. ఆశ కార్యకర్తల ద్వారా ప్రాథమిక వైద్య సేవలు ఉచితంగా పొందాలన్నారు. వైద్యాన్ని నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, జ్వరపీడితులు రక్తపరీక్షలు కూడా జరుపుకోవాలన్నారు. ఇంటి లోపల నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాపించి ఈ సీజన్లో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉందన్నారు. ప్రజలంతా దోమతెరలు వినియోగంపై కలెక్టర్ తగిన ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. ఆశ కార్యకర్తలు కళావతి, నారాయణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, భానుమతి, కళావతి, బుల్లమ్మ పాల్గొన్నారు.

మన్యం చిరుధాన్యాల స్వర్గధామం

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఐటీడీఏ పీవో అభిషేక్


సమావేశంలో పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతం చిరుధాన్యాల పంటలకు స్వర్గధామమని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహిస్తామన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. గిరిజనులు పండించే పశుపునకు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. ఏజెన్సీలో చిరుధాన్యాల సాగుపై వ్యవసాయాధికారులతో సమీక్షించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పల్లెలకు పరిమితమైన చిరుధాన్యాల వినియోగం నేడు ప్రపంచానికి చేరుకుందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం ప్రజలు చిరుధాన్యాలు వినియోగిస్తున్నారని ఆమె తెలిపారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీవీటీజీ గ్రామాల్లో పర్యటించినప్పుడు చిరుధాన్యాల సాగుపై గిరిజనులతో మాట్లాడి, సాగు వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రియ విధానంలోనే చిరుధాన్యాలు సాగు చేస్తున్నారన్నారు. వీరు పండించే ఉత్పత్తుల్లో మంచి పోషక విలువలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహించాలన్నారు. ఏప్రిల్ నెలలోనే ప్రతి ఏడాది రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని అన్నారు. చిన్నపాటి వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తే గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలలో పండ్ల తోటలు పెంచే విధంగా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. పట్టుపురుగుల పెంపకంపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖధికారి ఎస్‌బీఎస్. నందు, వ్యవసాయ సలహా మండలి బోర్డు డైరెక్టర్ కన్నా పాత్రుడు,అరకు,పాడేరు,చింతపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లి: రక్షిత అటవీ ప్రాంతాల్లో గంజాయి, రంగురాళ్ల తవ్వకాలు , చెట్ల నరికివేత, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా పటిష్ఠమైన నిఘా ఉంచాలని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు.శుక్రవారం చింతపల్లి అటవీశాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోగల అటవీశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అటవీ హక్కుల చట్టం కింద అటవీభూములకు సంబంధించి గిరిరైతులకు పట్టాలిచ్చినా ఆ భూములను రక్షిత అటవీ ప్రాంతంగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా చెట్ల నరికివేత, అగ్నిప్రమాదాలు వంటివి జరగకుండా అడవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడవుల రక్షణకు సంబంధించి క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉండాలన్నారు. సిబ్బంది తమ పరిధిలో అడవులకు సంబంధించిన పక్కా సమాచారం ఉండాలన్నారు. సిగనాపల్లి అటవీ ప్రాంతం వద్ద తరచూ రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అక్కడ ప్రత్యేకంగా సిబ్బందితో బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసులతో కలసి సమన్వయం చేసుకుని రంగురాళ్ల తవ్వకాలకు ప్రోత్సహిస్తున్న వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌వీ నగర్, సబ్ డీఎఫ్‌వో రాజు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలు రేంజి అధికారులు, ఎఫ్‌బీవోలు, సిబ్బంది హాజరయ్యారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ


వాహన యజమానులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇసుక తవ్వకాలు చేసి తరలించాలని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు, భారీగా అపరాధ రుసుం తప్పదని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మోటారు యూనియన్ యజమానులు, అన్ని పార్టీల నాయకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రతీ క్యూబిక్ మీటర్ ఇసుకకు 10 శాతం ప్రభుత్వానికి చెల్లించి గ్రామ సచివాలయంలో రశీదు పొందిన తరువాతే తరలించాలన్నారు. రుసుం చెల్లించకుండా తరలిస్తే వాహనాలు సీజ్‌తో పాటుగా అపరాధ రుసుం రూ.25 వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి గ్రామ సచివాలయాల పరిధిలో పక్కాగా రికార్డు నిర్వహించి, నగదుకు తగ్గ రశీదు ఇవ్వాలని సూచించారు. గ్రామ సచివాలయం పరిధిలో గ్రామ రెవెన్యూ అధికారి. గ్రామ రెవెన్యూ అసిస్టెంట్, గ్రామ సచివాలయం సిబ్బందికి బాధ్యత తీసుకోవాలన్నారు. దీనిపై ఎంపీడీవో, తహసీల్దార్, సీఐతో కూడిన విజిలెన్స్ టీం ఆకస్మిక తనిఖీ చేస్తారన్నారు. అక్రమ ఇసుక రవాణా ఇక నుంచి సాగదన్నారు. దీనికి సంబంధించి ఎంపిడీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరుస్తామని, రోజు నగదు జమ చేయాలన్నారు. పూర్తి ఆదేశాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అరడకోట, గలగండ, పెదకోడాపల్లి పంచాయతీ పరిధిలోని మత్స్యగెడ్డ ద్వారా ఇసుక అక్రమ రవాణా నిలిచిందన్నారు. ఇసుక తరలింపు అవకాశం గిరిజన వాహన యజమానులకే అవకాశం ఇవ్వాలని ,పాడేరు, హుకుంపేట ప్రాంతాల నుంచి గిరిజనేతరులే ఎక్కువగా ఇసుక రవాణా సాగిస్తున్నారని ఇకపై గిరిజన వాహనదారులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని గిరిజన వాహనదారులు, ప్రజా ప్రతనిధులు అసిస్టెంట్ కలెక్టర్‌ను విన్నవించారు. దీనిపై కలెక్టర్ నివేదిస్తామని ఆయన చెప్పారు. కలెక్టర్ నుంచి తదుపరి ఆదేశాల వచ్చేంత వరకు రవాణా చేయవద్దన్నారు. ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ భాస్కరరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఏఈలు ధ్రువకుమార్, సంజీవరావు, రెవెన్యూ సిబ్బంది, నాలుగు మండలాల ప్రయివేటు వాహనదారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో


గాయపడిన క్షతగాత్రులు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి-చింతపల్లి ప్రధాన రహదారి మధ్య దుచ్చరపాలెం వంతెన వద్ద మలుపులో శుక్రవారం ఒక ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తాపడిన ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. రింతాడ సమీపంలోని తీములబంద గ్రామానికి చెందిన పదిమంది గిరిజనులు లంకపాకల్లో జరిగే శుభకార్యానికి గ్రామానికి చెందిన ఆటోలో బయలుదేరారు. దుచ్చరపాలెం మలుపులో ఈ ఆటో ప్రమాదానికి గురైంది. ఆటో డ్రైవర్ కిరణ్‌తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న పదిమందికి గాయాలయ్యాయి. వీరిలో రామారావు, చిలకమ్మతోపాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారందరినీ చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

హైబ్రిడ్ పసుపు రకాలతో అధిక దిగుబడి


సూచనలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్

చింతపల్లి: మేలు రకపుహైబ్రిడ్ రకాల పసుపుసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చునని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ అన్నారు. మన్యంలో వ్యవసాయ కార్యక్రమాలను చేపడుతున్న టాటా కన్సల్టెన్సీ ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం అయ్యారు. ఉద్యాన సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆచరించాల్సిన ఆధునిక విధానాలను వివరించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్త బిందు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ హననం చేసి..

యువతి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష

చోడవరం రూరల్: ఇరుగు పొరుగు వారై ఉండి చిన్నపాటి గొడవలో యువతి వ్యక్తిత్వ హననం చేసిన నేరానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వర్తనాపల్లికి చెందిన ముగ్గురు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన అదనపు పీపీ వేచలపు వెంకటరావు వివరాల ప్రకారం... 2021 నవంబరు 28న పాడేరు పోలీసు స్టేషన్ పరిధిలోని వర్తనాపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు సోనీ శివ రామకృష్ణ చెల్లెలు గాయత్రి ఉదయం 11 గంటలకు ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొరుగు ఇంటి వారైన నిందితులు మోసే చంద్రకళ, మోసే నాగమణి, కంబడి శివశంకర్ తన చెల్లిని మానసిక వేదనకు గురి చేశారని, ఆమె వ్యక్తిత్వాన్ని తూలనాడారని, ఈ అవమానం భరించలేక చనిపోయిందంటూ పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనకు ముందు వారం రోజులుగా తమ ఇంటిపైకి వాడక నీరు వస్తుందని, మృతురాలితోపాటు ఆమె తల్లితోనూ నిందితులు గొడవలు పడ్డారు. దాంతో ఫిర్యాదుదారు తండ్రి మురుగునీరు సక్రమంగా పోయేలాగా మరమ్మతులు చేయించాడు. అయినప్పటికీ అదే నెల 27వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో నిందితుల ఇంటి ముందు ఫిర్యాదీ కారు అడ్డంగా నిలిపారంటూ గాయత్రి, ఆమె తల్లితో గొడవకు దిగారు. గాయత్రిని నోటికి వచ్చిన రీతిలో దూషించడమేగాకుండా ఆమెకు లేనిపోని సంబంధాలు అంటగట్టారు. మరుసటిరోజు ఉదయం 10 గంటల సమయంలోనూ ఇదే రీతిలో ప్రవర్తించగా, గాయత్రిని తల్లి సముదాయించి మేకలను మేపడానికి వెళ్లిపోయింది. అటు తర్వాత గాయత్రి మనసు గాయపడటంతో 11 గంటల సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయింది. దీంతో గాయత్రిని ఆత్మహత్మకు ప్రేరేపించారని నిందితులుపైనా ఐపీసీ 306 రెడ్ విత్ 34 సెక్షన్ కింద నేరాభియోగ పత్రాన్ని మోపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించాక నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పై విధంగా తీర్పు చెప్పారు.

కొనసాగుతున్న వర్షాలు

- చెరువువీధి గ్రామంలో కూలిన పెంకుటిల్లు


కిల్లోగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ,అరకు సంత బయలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో అరకు వారపు సంతకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. సుమారు 2 గంటల పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ చెరువువీధి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఉల్లి సత్యనారాయణకు చెందిన పెంకుటిల్లు కూలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. సుమారు రూ.లక్షమేర ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.